
ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఆదివారం(ఇఫ్తార్-6:34) । సోమవారం (సహెర్-5:02)

ANDHRAJYOTHY

5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

ఆదివారం 17 మార్చి 2024



వేదికపై అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ; చిత్రంలో ఎంపీ రాములు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్ ప్రసాద్ తదితరులు

కాంగ్రెస్.. బీఆర్ఎస్.. రెండూ ఒకటే

సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



- నాగర్‌కర్నూల్ సభలో నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ
- తెలంగాణలో అత్యధిక స్థానాలు బీజేపీవేనని వ్యాఖ్య
- తమ ప్రభుత్వ హయాంలోనే అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందని వెల్లడి



సభకు హాజరైన ప్రజలు



వినదిస్తున్న సభికులు



సభకు వస్తున్న మహిళలు



ఈ చిన్నారి అభివాదం చేయడంతో ప్రధాని తిరిగి అభివాదం చేశారు..



మోదీ సభలో ఎమ్మార్పీఎస్ జెండాలు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాటు పాలించిన కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలు రెండు ఒకటేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. వెనుకబడిన ప్రాంతమైన మహబూబ్‌నగర్ జిల్లా మరింత అభివృద్ధిలోకి రావాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించి, తనకు మద్దతుగా నిలవాలని కోరారు. బీజేపీ విజయ సంకల్ప సభ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సభకు అధ్యక్షత వహించారు. ఉదయం 11:40 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రధాని మోదీ నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నారు. ఉమ్మడి జిల్లా నాయకులను పేరు పేరున పలకరించారు. ప్రజలు సభకు అధిక సంఖ్యలో హాజరు కావడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు. 12:10 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ 40 నిమిషాల పాటు మాట్లాడారు. తెలుగు నేర్చుకోవడంపై తనకున్న ఆసక్తిని జనానికి వివరించారు. తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు తెలంగాణలోని నా కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ స్పష్టమైన వాచకంతో పేర్కొన్నారు. దీంతో సభికులు హర్షధ్వానాలు చేశారు. మోదీ తన ప్రసంగంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను టార్గెట్ చేశారు. బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నప్పుడల్లా ప్రజలు కేరింతలు కొట్టారు. రెండు పార్టీల చరిత్ర కుంభకోణాలమయని పేర్కొన్న మోదీ.. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ పార్లమెంట్ స్థానాల్లో కచ్చితంగా గెలిచి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల్లో శాసన సభ ఎన్నికలకు.. ఇప్పటికి పోల్చితే ఎంతో పరిణితి కన్పిస్తుందన్నారు. రెండంకెల్లో బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మార్చివేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

హాజరైన బంగారుశ్రుతి

నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ దక్కనందుకు బాధలో ఉన్న బంగారు శ్రుతి ప్రధాని నరేంద్రమోదీ సభకు హాజరయ్యారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసిన ఆమెకు ఈసారి టికెట్ రాలేదు. సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్‌కు బీజేపీ టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. అదే రోజు బంగారుశ్రుతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశమైంది. తాను వ్యక్తిగత పనుల కోసమే సీఎంను కలిశానని ఆ తర్వాత ఆమె క్లారిఫికేషన్ ఇచ్చారు. అయినా ఆమె అసంతృప్తితోనే ఉన్నారని ప్రచారం జరిగింది. అయితే మోదీ సభకు హాజరైన ఆమె రెండు నిమిషాల పాటు ప్రధానితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమెకు మున్ముందు సముచిత స్థానం కల్పిస్తామని మోదీ భరోసా ఇచ్చినట్లు సమాచారం.



ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్; చిత్రంలో పాలమూరు అభ్యర్థి అరుణ, ఎంపీ రాములు

మరోసారి మద్దతు ఇవ్వండి

బీజేపీని ఆశీర్వదించేందుకు నాగర్‌కర్నూల్ సభకు వచ్చిన జన సునామిని చూశాక తెలంగాణలో ఫలితాలు అర్థమవుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. నిన్న సాయంత్రం మల్కాజిగిరి రోడ్‌షోలో అద్భుతం చూశానని, పార్టీని ఆశీర్వదించేందుకు అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చారని, అదే పరిస్థితిని ఇక్కడ కూడా కళ్లారా చూస్తున్నానని అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై తెలంగాణ ప్రజల కోపాన్ని చూశానని, ఈ ఎన్నికల్లో బీజేపీపై ప్రేమను చూస్తున్నానని చెప్పారు. మరోసారి తెలంగాణ ప్రజలు మోదీ సర్కార్‌కు అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారని అన్నారు. బీజేపీ నుంచి మీకు సేవ చేసే బాధ్యతను ఇక్కడున్న ఎంపీ అభ్యర్థులైన డీకే అరుణ, భరత్‌ప్రసాద్, జి.కిషన్‌రెడ్డి, సైదిరెడ్డిలకు అప్పగించడం జరిగిందని, వీరికి పూర్తి మద్దతు ఇచ్చి విశ్వాసాన్ని ప్రకటించాలని కోరారు. నేను సంభాషణలను మీతో పంచుకునేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని.. ట్విటర్, ఎక్స్‌లో, నమో ఇన్ తెలుగు అనే యాప్ ద్వారా తెలుగులో సంభాషణలు వినవచ్చని తెలిపారు. గత ఎన్నికల్లో బీజేపీ ఓట్లను రెండింతలు చేశారని, ఈసారి ఎంపీ సీట్లను డబుల్ డిజిట్ చేస్తారన్న నమ్మకం తనకుందన్నారు. సభలో ఎంపీ పోతుగంటి రాములు, నల్గొండ అభ్యర్థి సైదిరెడ్డి, జక్కారఘునందన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దిలీప్‌చారి పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సైడ్ లైట్స్

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విజయ సంకల్ప సభా ప్రాంగణం చుట్టూ ఎస్‌జీపీ బలగాలు భారీ భద్రతను ఏర్పాటు చేశాయి.
- ఉదయం 11:38 గంటలకు ప్రధాని మోదీ హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా.. సభకు వచ్చిన జనం పెద్ద ఎత్తున ఈలలు, కేరింతలు కొడుతూ స్వాగతించారు.
- హెలిప్యాడ్‌లో మూడు హెలిక్యాప్టర్‌లు దిగడంతో జనం వాటిని ఆసక్తిగా తిలకించి, సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు.
- బ్యాండ్ మేళాలతో మోదీకి స్వాగతం పలికారు.
- ఉదయం 11:56 గంటలకు మోదీ వేదికపైకి చేరుకోగా మోదీ.. మోదీ అంటూ చేసిన నినాదాలతో సభాప్రాంగణం దద్దరిల్లింది.
- మోదీ వేదికపై ప్రజలందరికీ అభివాదం చేస్తున్న సమయంలో ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్ అంటూ నినదించారు.
- ప్రసంగానికి ముందు ప్రధానిని బీజేపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్‌ప్రసాద్, సైదారెడ్డిలు సన్మానించారు.
- మధ్యాహ్నం 12:10 గంటలకు ప్రారంభమైన ప్రధాని ప్రసంగం 12:53 గంటలకు వరకు.. 43 నిమిషాలపాటు కొనసాగింది.
- ప్రధాని తన ప్రసంగాన్ని తెలుగులో అనువదించిన నాయకుడు రాకా సుధాకర్‌ను అభినందించారు.
- మధ్యాహ్నం 1:08 గంటలకు ప్రధాని హెలికాప్టర్ టేక్ ఆఫ్ అయ్యింది. ప్రధాని పర్యటన విజయవంతం కావడంతో పోలీసులు, బీజేపీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.
- మీటింగ్ అనంతరం ఒకే రోడ్డు కావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ రెండు కిలో మీటర్లు వెళ్లేందుకు గంట సమయం పట్టింది. అదే సమయంలో ఒంటిపూట బడులు వదలడంతో విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సులు, ఆటోలు కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

తెలుగులో మాట్లాడిన మోదీ

మోదీ ప్రసంగం ప్రారంభించే ముందు తెలుగులో మాట్లాడి శ్రేణులను ఉత్సాహపరిచారు. నా తెలంగాణ.. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం అని చెప్పడంతో సభికులు కేరింతలు, చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకుడు రాకా సుధాకర్ తెలుగులో అనువాదం చేశారు. ప్రధాని తొలుత ఐదు నిమిషాల సేపు మాట్లాడిన తరువాత రాకా సుధాకర్ ఆ ప్రసంగం మొత్తాన్ని తెలుగులో చక్కగా అనువాదం చేశారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ ఇంత పెద్ద ప్రసంగాన్ని చక్కగా అనువదించారని, నువ్వు నాతో పదిరోజులు ఉంటే నేనే తెలుగు నేర్చుకుంటానని నవ్వుతూ అన్నారు. దీనికి రాకా సుధాకర్ ప్రతిస్పందిస్తూ మీతో పది రోజులుండే సౌభాగ్యం తనకు లభిస్తే.. మీకు తెలుగు వస్తుంది నా జీవితం ధన్యమవుతుందని అన్నారు.

దొంగలుపోయి గజదొంగలు వచ్చారు : కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి బీఆర్ఎస్ పోవాలనుకుంటే అంతకుమించిన అవినీతి పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారిందని, దొంగలు పోయి గజదొంగలు వచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ రూ.లక్షల కోట్లు అవినీతికి పాల్పడిందని, తెలంగాణలో ఎన్నికలకు ముందు గ్యారెంటీల పేరుతో గారడి చేసి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలని, బీజేపీ నేతృత్వంలో ప్రజలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుబాష నేర్చుకోవడానికి మోదీ ప్రయత్నం చేస్తున్నారని, ఎక్కడికెళ్లినా తెలుగులో మాట్లాడుతున్నారని చెప్పారు. తెలుగుబాషకు ప్రపంచంలో గౌరవం తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

అందరినోట ఒకటే మాట: డీకే అరుణ

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడికెళ్లినా.. ఎవరిని పలకరించినా.. అందరినోటా ఒకటే మాట అని, అదే నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేయాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారని చెప్పారు. ప్రధానిగా మోదీని తప్ప ప్రజలు మరో వ్యక్తిని ఊహించుకోవడం లేదన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశాన్ని ప్రపంచంలో ఐదో స్థానానికి తీసుకెళ్లారని చెప్పారు. మోదీ లక్ష్యం వికసిత్ భారత్ సంకల్పమని, 2047 కల్లా భారత్‌ను అగ్రదేశాల సరసన మొట్టమొదటి దేశంగా నిలపాలని అనుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో 12-15 స్థానాలను బీజేపీ గెలువబోతుందన్నారు. తమను గెలిపిస్తే కరువు జిల్లా అయిన ఉమ్మడి పాలమూరును నెంబర్ వన్ జిల్లాగా తీర్చిదిద్దుకుందామని వెల్లడించారు.

టికెట్ రాని వారిని తీసుకుపోతున్నారు: ఆచారి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీలో ఎవరైతే అలిగారో, పార్టీలో టికెట్ రాలేదో వారి ఇళ్ళ చుట్టూ తిరిగి తోలుకుపోయే పరిస్థితి వచ్చిందని, ఇది ఇవ్వాళ కాంగ్రెస్‌కు పట్టిన దుస్థితి అని బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా రైతులకు పాల బిల్లులు ఇవ్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి పాలమూరులోని రెండు ఎంపీ స్థానాలతోపాటు నల్గొండ ఎంపీ అభ్యర్థిని గెలిపించి మోదీకి బహుమతిగా ఇద్దామని అన్నారు.

మోదీతోనే భవిష్యత్తు: భరత్ ప్రసాద్

నరేంద్ర మోదీని మరోసారి ప్రధాన మంత్రిని చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. మోదీ ప్రధాని అయితేనే దేశానికి, మహిళలకు, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఐదు శతాబ్దాల కల అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించిన ఘనత మోదీదేనని చెప్పారు. మోదీ ప్రధాని అయితే ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెడతారని చెప్పారు.

మోదీకి కానుకగా ఇద్దాం: ఎల్లేని సుధాకర్‌రావు

అంతర్జాతీయంగా భారత్‌కు ప్రముఖ స్థానం కల్పించిన నరేంద్రమోదీ మళ్లీ దేశానికి ప్రధానమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు లేకున్నా సోమశిల-సిద్దేశ్వరం వంతెన, జాతీయ రహదారి సాధించామని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీని గెలిపించి, మోదీకి కానుకగా ఇద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని శాలుశాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

పెంట్లవెల్లి, మార్చి 16 : ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం సింగవరం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూరు మండలం కొండనాగుల గ్రామానికి చెందిన చెంచు బక్కమ్మ(35), బక్క లింగస్వామి భార్యాభర్తలు. పెంట్లవెల్లి మండల పరిధిలోని సింగవరం గ్రామంలోని మామిడి తోటలో పని చేసేందుకు వలస వచ్చారు. భార్యాభర్తలు నిత్యం గొడవ పడుతూ ఉండేవారు. గురువారం బక్కమ్మ బాత్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి మామిడి తోటలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు..
మోగిన నగారా



- షెడ్యూల్ విడుదల.. అమల్లోకి ఎన్నికల కోడ్
- మే 13న ఎన్నికలు.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగానే.. మరో కోడ్

మహబూబ్‌నగర్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు స్థానాల్లో ఇక రాజకీయం మరింత వేడెక్కనుంది. తెలంగాణలో మే 13న నాలుగో విడతలో ఎన్నికలు జరుగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూన్ నాల్గో తేదీన ఓట్లను లెక్కించనున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో బీజేపీ నుంచి ఎంపీ రాములు తనయుడు భరత్ ప్రసాద్‌ను పోటీలో ఉండగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రెండు లోక్‌సభల పరిధిలో ఇప్పటికే ఓ విడత ప్రచారం ముగించారు. మే 13న ఎన్నికలు అంటే మరో రెండు నెలల సమయం ఉంది. ప్రచారం నిర్వహించడం, కేడర్ చేజారి పోకుండా కాపాడుకోవడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడు కానుంది. మరోవైపు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికే పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులు ప్రారంభం అయ్యాయి. ఎప్పుడు ఎవరు ఏ పార్టీ మారుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పార్టీ ఫిరాయింపులు కాకుండా కాపాడుకుంటూనే అవతలి పార్టీ వాళ్లను తమ వైపునకు తిప్పుకునేందుకు పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి.

గృహజ్యోతి అమలు మరింత ఆలస్యం

ఉమ్మడి పాలమూరులో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో ఇప్పటికే కోడ్ అమలులో ఉంది. ఫిబ్రవరి 26న షెడ్యూల్ విడుదల అవడంతో కోడ్ అమలులోకి వచ్చింది. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ కోడ్ అమలులో ఉండనుంది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే వారికి జీరో బిల్లు ఇస్తున్నారు. రాష్ట్రంలో గత నెల నుంచే ఇది అమల్లోకి రాగా.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కోడ్ కారణంగా అమలు కాలేదు. ఈ కోడ్ ఉండగానే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో మరో మూడు నెలల వరకు ఈ పథకం అమలు అయ్యే అవకాశం లేదు. దాంతో వినియోగదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

35,15,190 మంది ఓటర్లు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్‌ల పరిధిలో 35,15,190 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,80,417 మంది ఉండగా, నాగర్‌కర్నూల్ పరిధిలో 17,34,773 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 17,18,987 మంది మహిళా ఓటర్లు కాగా, 16,96,114 మంది పురుష ఓటర్లు ఉన్నారు. పురుషుల కన్నా మహిళలే 22,873 మంది అధికంగా ఉన్నారు. కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునే వారు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు అవకాశం కల్పించారు. అప్పటివరకు 18 ఏళ్ల వయస్సు పూర్తయి ఉండాలి. ఆ సమయం నాటికి ఓటు మార్పుకు కూడా అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 3,860 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇవ్వడంతోపాటు ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. బందోబస్తు పరంగా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంది. ఎన్నికల కోసం కేంద్ర బలగాలు జిల్లాకు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించిన ఫార్ములానే ఈ ఎన్నికల్లోనూ ఫాలో కానున్నారు. రూట్ మ్యాప్, పోలింగ్ స్టేషన్‌ల వద్ద బందోబస్తునకు కసరత్తు దాదాపు పూర్తయ్యింది. ఎన్నికల సమయంలో నగదు రవాణాపై పోలీస్‌శాఖ నిఘా ఉంచనుంది. బ్యాంక్ లావాదేవీలపై దృష్టి సారించనున్నారు. జిల్లా అంతటా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలను ముమ్మరం చేయనున్నారు. ఫిర్యాదులకు సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు.



నోడల్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.ఎం. సంతోష్

గద్వాల న్యూటౌన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నిల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలకపాత్ర అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.ఎం. సంతోష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువెడిన సందర్భంగా ఎన్నికల నిర్వహణకై నియమించిన నోడల్ అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నోడల్ అధికారులందరు వారికి కేటాయించిన ఎన్నికల విధులను పూర్తి అవగాహక కల్గిఉండి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పీవో, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ నరేష్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని యువకుడి మృతి

వెల్దండ, మార్చి 16 : ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కల్వకుర్తి మండలం ఎంగంపల్లి గ్రామానికి చెందిన నూతనగంటి సంపత్(22) అనే యువకుడు గుండాల గ్రామంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం సంపత్ తన టాటా ఏస్ ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా కొట్ర సమీపంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. దీంతో సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న బస్సు

▸ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి



ఆంజనేయులు(ఫైల్)

మహబూబ్‌నగర్, మార్చి 16 : విధులు ముగించుకుని నడుచుకుంటూ వెళ్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కోడుగంటి ఆంజనేయులు(52) పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తాడు. రోజు మాదిరిగానే శనివారం ఇంటినుంచి పనికి వెళ్లిన ఆయన విధులు పూర్తి చేసుకుని సాయంత్రం 5:30 గంటలకు ఇంటికి వచ్చేందుకు నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళ్తుండగా పోస్టాఫీసు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ టూటౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్ శ్యామ్‌సుందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.







నేటి నుంచి
రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

» ఈనెల 22 నుంచి ఏప్రిల్ తొమ్మిది వరకు జాతర
» 24న రథోత్సవం
» వివిధ ప్రాంతాల నుంచి హాజరుకానున్న భక్తులు


శిల్పకళతో నిర్మించిన ఆలయం

శ్రీరంగాపురం, మార్చి 16 : ఉత్తర శ్రీరంగగా ప్రఖ్యాతి గాంచిన తెలంగాణలో దివ్యక్షేత్రంగా వెలసిన శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 22 నుంచి ఏప్రిల్ తొమ్మిదో తేదీ వరకు జాతర కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతీఏటా పాల్గుణ మాసం పుబ్బ నక్షత్రం నుంచి ఉత్సవాలు జరుగుతాయి. 22న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి తిరుకల్యాణోత్సవం జరగనుంది. ఈనెల 24న శ్రీరంగనాథస్వామి రథోత్సవం పగలు, రాత్రి జరుగుతుంది. శ్రీరంగనాథస్వామి ఆలయ గ్రూప్స్ ధర్మకర్తలు శ్రీకృష్ణ దేవ రాయల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

శిల్పకళలకు నిలయం శ్రీరంగ ఆలయం

భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా శిల్ప కళలు ఈ ఆలయంలో దర్శనమిచ్చి భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీరంగనాథస్వామి తమిళనాడులోని ప్రఖ్యాతి గాంచిన ప్రసిద్ధ వైష్ణవ పుణ్య క్షేత్రం. దానికి సమానంగా తెలంగాణలోని వనపర్తి జిల్లా సంస్థానధీశులైన రాజా రామేశ్వరరావు బహిరి బలవంత బహద్దూర్ వారి ధర్మపత్ని రాణి శంకరమ్మచే 1804లో శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆర్థికంగా లేని భక్తులు, తమిళనాడులోని శ్రీరంగనాథుని దర్శించుకోలేని వారు ఇక్కడి శ్రీరంగనాథుని దర్శించుకుంటారని ఆస్తికుల విశ్వాసం. వివిధ శిల్ప సాంప్రదాయాలతో ద్వార పాలక శిల్పాలతో ఆకాశాన్నంటే అంతస్తులతో నిర్మించిన రెండు గాలి గోపురాలు సందర్శకులను ఆశ్చర్యచకితులను చేసే విధంగా స్వాగతం ఇస్తుంది. రంగనాథస్వామి ఆలయ ప్రధాన ద్వారం శేష నాయుడై అభయహస్తం చూపుతూ, స్వామివారి ఎడమ వైపున చతుర్భుజాకారంలో లక్ష్మీదేవి అమ్మవారు కొలువై ఉంటారు.

అందరినీ ఆకట్టుకునే రంగసముద్రం రిజర్వాయర్

భీమా ప్రాజెక్టు అంతర్భాగమైన రంగసముద్రం బ్యాలెన్స్ రిజర్వాయర్ నిర్మాణం అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ రిజర్వాయర్ మధ్యలో శ్రీరంగనాథస్వామి ఆలయం నిలిచింది. ఆలయం చుట్టూ 99 శాతం నీటితో నిండి ఉండటం సందర్శకులను ఆకర్షిస్తుంది. ఆలయ ప్రాంగణంలో పచ్చిక బయలుతో సుగంధ పూలచెట్లు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. తెలంగాణలోని వనపర్తి జిల్లాలో శ్రీరంగసముద్రం మండల కేంద్రంలో శ్రీరంగనాథస్వామి ఆలయానికి రావడానికి హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే 44వ జాతీయ రహదారి పెబ్బేరు నుంచి 11 కి.మీ., వనపర్తి నుంచి 24 కి.మీ. దూరం ఉంటుంది. బ్రహ్మోత్సవాలకు రాజధానితో పాటు, ఆంధ్ర, రాయలసీమ, కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ నెల ఉగాది వరకు జరుగుతాయి. 24న జరిగే రథోత్సవానికి ఆలయ నిర్వాహకులు, పోలీస్‌శాఖ ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించనుంది.


శ్రీరంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మధ్యలో వెలిసిన శ్రీరంగనాథస్వామి ఆలయం (అంతర చిత్రంలో) ఆలయంలో వెలసిన శ్రీరంగనాథస్వామి

మంత్రి సమక్షంలో కౌన్సిలర్ల చేరిక

కొల్లాపూర్, మార్చి 16 : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపులో మునిసిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ సభ్యులు భాగస్వామ్యం కావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన కౌన్సిలర్ పబ్బతి హైమావతి, 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ అలివేలమ్మతో పాటు, 12వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ మునిసిపాలిటీ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపులో మునిసిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ సభ్యులు భాగస్వామ్యం కావాలని, భారీ మెజారిటీతో మన్నె జీవన్ రెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా జూపల్లి కోరారు.


మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

బొటానికల్ గార్డెన్ అద్భుతం

» పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్

జడ్చర్ల, మార్చి 16 : ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన బొటానికల్ గార్డెన్ అద్భుతంగా ఉందని పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ కితాబునిచ్చారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలోని తెలంగాణ గార్డెన్ నాలుగవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఓయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మాధవి తదితరులతో కలిసి ఆయన గార్డెన్‌ను సందర్శించారు. గార్డెన్‌లో మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇలాంటి గార్డెన్ ఉంటే విద్యార్థులకు పరిశోధనాశక్తి పెరుగుతుందన్నారు. ఆ తర్వాత గార్డెన్‌కు అనుసంధానంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధనా, విద్యాకేంద్రాన్ని సందర్శించి, అందులో జరుతుతున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. గార్డెన్‌లోని సీతాకోకచిలుకలు, పక్షులు, ఇతర కీటకాలను నమోదు చేస్తున్నట్లు వాటి ఫొటోలను చూసి వారు విద్యార్థులను అభినందించారు. గార్డెన్‌లోనే ఐదు రకాల తేనెటీగలు ఉండటం సంతోషించదగ్గ విషయమన్నారు. ల్యాబ్‌లో నిల్వచేసిన అతిపెద్ద పాము, జెర్రిపోతు పాము కుబుసం చూసి అభినందించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కాగితాలు, విత్తనాలతో తయారు చేసిన వృక్ష నమూనాను తిలకించి విద్యార్థులకు కితాబునిచ్చారు. తరువాత విద్యార్థులు వివిధ పండ్లతో తయారుచేసిన సహజసిద్ధ కేక్‌ను కట్ చేసి సదాశివయ్యను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ, అధ్యాపకులు సుభాషిణి, లత, పరిశోధక విద్యార్థులు రమాదేవి, వలంటీర్లు రాహుల్, వీరాంజనేయులు తదితరులున్నారు.


గార్డెన్‌లో మొక్కలు నాటి నీరు పోస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య

కోడేరు, మార్చి 16 : పంచభూతాలా సాక్షిగా ప్రమాణం చేసి వివాహం చేసుకున్న భార్యను అతి కిరాతకంగా కత్తితో గొంతుకోసి హత్యచేసి తానుకూడా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న భర్త ఉదంతం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తుర్కదిన్నె గ్రామానికి చెందిన గొల్ల మంగదొడ్డి శివశంకర్(35) రాజాపూర్ గ్రామానికి చెందిన గొల్ల భారతి బాలీశ్వరమ్మ(22) భార్యాభర్తలు. శివశంకర్‌కు గతంలోనే పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామానికి చెందిన నర్మదతో వివాహమై ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా ఆమెతో తరచూ గొడవలు పడి ఆమెకు తెలియకుండా బాలీశ్వరమ్మను నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆరు నెలల కిందట భార్యాభర్తలు గొడవ పడి ఆమె రాజాపూర్‌లోని తల్లి ఇంట్లో ఉంటోంది. శివశంకర్ హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తున్నాడు. నాలుగు రోజుల కింద తన గ్రామం తుర్కదిన్నెకు వచ్చాడు. శనివారం మధ్యాహ్నం రాజాపూర్‌లో ఇంట్లో ఎవరూ లేకుండ ఉన్న భార్య బాలీశ్వరమ్మ(22) గొంతును కత్తితో కోసి భర్త హత్య చేశాడు. అనంతరం శివశంకర్ తుర్కదిన్నె శివారులోని తన కోళ్ల ఫారంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ఖయ్యూమ్ తెలిపారు.


హత్యకు గురైన బాలీశ్వరమ్మ (ఫైల్)


ఆత్మహత్య చేసుకున్న శివశంకర్ (ఫైల్)

గౌరవం లేని చోట ఉండలేను

» కాంగ్రెస్ పార్టీతోనే మంచిరాజ్యం
» మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు, మార్చి 16 : గౌరవం లేనిచోట ఉండలేను.. గౌరవం ఉన్న చోట ఎన్ని కష్టాలైనా అనుభవిస్తూ సంతోషంగా ఉంటానని మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, కుమారుడు ఏపీ మిథున్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 ఏళ్ల రాజకీయ జీవితంలో పాలమూరు ప్రజలతో కలిసి జీవిస్తూ ఉంటున్నట్లు తెలిపారు. పుట్టుక, పెళ్లి, శుభకార్యాలు అన్నింటా, ప్రజల కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటూ రెండు సార్లు ఎంపీగా పనిచేసినట్లు తెలిపారు. అగౌరవాన్ని జితేందర్‌రెడ్డి భరించడని ఏబీఎన్‌లో ప్రసారమయ్యే ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 1996 నుంచి జిల్లా కేంద్రంలో సొంత ఇల్లు కట్టుకొని నివసిస్తున్నట్లు తెలిపారు. బీజేపీకి మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఎన్నికలప్పుడు అభ్యర్థులు లేకపోతే తన కుమారుడిని తీసుకువచ్చినట్లు చెప్పారు. స్థానిక, రాష్ట్ర నాయకత్వం పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి ఎంపీ సీటు మరొకరికి కేటాయించినప్పటికీ కనీసం ఒక్కరు కూడా వచ్చి ధైర్యంగా ఉండమని భరోసానిచ్చినవారు లేరన్నారు. సీఎం స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి జిత్తన్నా ఏమీ బాధపడకు, ధైర్యంగా ఉండమని భరోసానిచ్చారన్నారు. మల్కాజిగిరి సీటు ఇస్తానంటే వద్దని వారించినట్లు తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించారని, మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకొని వచ్చే బాధ్యత అప్పగించటం సంతోషంగా ఉన్నదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, పీఆర్ఎల్ఐ పనులు పూర్తి చేసి ప్రజలకు మేలు చేసే దమ్ము కాంగ్రెస్ పార్టీకే ఉన్నదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే మంచి రాజ్యం సాధ్యమవుతుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులను కనీసం పిలిచి ధైర్యం చెప్పలేదని ఏపీ మిథున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకత్వం ఇదేవిధంగా ఉన్నంత వరకు బీజేపీ బాగుపడే పరిస్థితి లేదన్నారు. బీజేపీకి అభ్యర్థులే లేని సమయంలో తన కుమారుడిని నిలబెట్టి భరిస్తే నేడు ఎంపీ టికెట్ నిరాకరించటం, కనీసం భరోసానివ్వకపోవటం బాధగా ఉన్నదన్నారు. స్థానిక, రాష్ట్ర నాయకత్వం పట్టించుకోకపోవటాన్ని బీజేపీలో పని చేసే కార్యకర్తలు ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన జితేందర్‌రెడ్డి సహకారం సంపూర్ణంగా ఉండాలని చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. రెండుసార్లు ఎంపీగా పనిచేసిన జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.వినోద్ కుమార్, ఎన్‌పీ వెంకటేష్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

నేడు 'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ

పాలమూరు, మార్చి 16 : కవి ఉదయమిత్ర రచించిన 'రాయగూడని పద్యం' పుస్తకాన్ని ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లో ఆవిష్కరించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని మారుమూల ప్రాంతం సిరిగిరి నుంచి వచ్చిన మౌమితా అలం రచించిన పుస్తకం ఇది. ఆమె రాసిన ఆంగ్ల కవితలు అనువాదాలు మలయాళీ, మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో అచ్చయినట్లు తెలిపారు. వాటిని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉదయమిత్ర తెలుగులోకి అనువాదం చేసి రాయకూడని పద్యం అనే సంకలనాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాల్లో పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు రాఘవాచారి తెలిపారు.

మూల్యాంకనం జాగ్రత్తగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 16 : ఇంటర్ మూల్యాంకనం జాగ్రత్తగా నిర్వహించాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ అన్నారు. శనివారం మొదటి స్పెల్‌కు సంబంధించి ఇంటర్మీడియట్ మూల్యాంకనం పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. క్యాంపు సిబ్బంది క్యాంపు వేళలను కచ్చితంగా పాటించాలని, ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్యాంపులో కచ్చితంగా ఉండాలన్నారు. క్యాంపులోకి మొబైల్స్ నిషేధమన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐదు జిల్లాలకు చెందిన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


నరేష్ (ఫైల్)

అయిజ, మార్చి 16 : ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం మూగోనిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మీర్జాపురం కుర్వ ఆంజనేయులు, సరోజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆఖరివాడైన నరేష్(11) మండల పరిధిలోని భూమ్‌పూర్ గ్రామంలో ఆరో తరగతి చదువుతున్నాడు. శనివారం యథావిధిగా పాఠశాలకు వెళ్లి వచ్చాడు. ఒంటిపూట బడులు కావటంతో వారి స్వంత గ్రామంలో మధ్యాహ్నం వేళ తోటి స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు బావికి వెళ్లాడు. బావి పైనుంచి కొర్రు(తలకిందులుగా) దూ కాడు. ఈ క్రమంలో బావిలో ఉన్న రాయికి బాలుడి తల పగిలి తీవ్ర గాయమై అక్క డికక్కడే మృతి చెందాడు. బాలుడు ఎంతకూ నీటి పైకి రాకపోవడంతో స్నేహితులు కేకలు వేయగా పొలాల చుట్టుపక్కల ఉన్నవారు హుటాహుటిన వచ్చి నీటిలో మునిగి ఉన్న మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


హరికృష్ణ (ఫైల్)

బల్మూరు, మార్చి 16 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలో ప్రేమ విఫలం అయిందని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు దేగ హరికృష్ణ(25) శనివారం తెల్లవారుజామున నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దేగ పార్వతమ్మ, లక్ష్మయ్యల ఏకైక కుమారుడు హరికృష్ణ గ్రామంలోనే ఒక యువతిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కానీ ఆ యువతికి వేరే సంబంధం మాట్లాడడంతో మనస్తాపానికి గురై గత ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలలో ఎల్ఈడీ టీవీ చోరీ

గోపాల్‌పేట, మార్చి 16 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని బండపల్లి పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల స్టాఫ్‌రూమ్ తలుపులు విరగ్గొట్టి ఎల్ఈడీ టీవీని ఎత్తుకెళ్లారు. దీంతో గ్రామస్థులు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. గతంలో ఈ పాఠశాలలో ట్యాబ్ ఫోన్ కూడా ఎత్తుకెళ్లినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హెచ్ఎం కృష్ణయ్య శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై హరిప్రసాద్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


స్టాఫ్ రూమ్ తాళాలు విరగ్గొట్టిన దృశ్యం

మద్యం మత్తులో ఘర్షణ, ముగ్గురికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, మార్చి 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న వైన్ షాపుల వద్ద ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నగరానికి చెందిన కొంతమంది వ్యక్తులు మద్యం తాగేందుకు తెలంగాణ బార్డర్‌లో ఉన్న వైన్ షాపుల వద్దకు వచ్చారు. మద్యం తాగుతూ మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. చిలికిచిలికి గాలివానలా మందుబాబులు గొడవ పడుతూ జాతీయ రహదారిపైకి వచ్చి ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా దాడి చేసుకున్నారు. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో రోడ్లపై వెళ్లే ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఈ విషయంపై తమకు సమాచారం మాత్రమే ఉందని, ఎవరైనా ఫిర్యాదు కేసు నమోదు చేస్తామని సీఐ రవిబాబు తెలిపారు.

బావిలో జారిపడిన మహిళలు, తప్పిన ప్రాణాపాయం

బిజినేపల్లి, మార్చి 16 : బతుకుదెరువు కోసం చిత్తు కాగితాలు, పాత సామాన్లు ఏరుకుంటూ ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయిన ఇద్దరు మహిళలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం 14వ వార్డులోని బొడ్డలగడ్డ బావి చుట్టూ ఉన్న చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ సామాన్లను శనివారం బిజినేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఏరుకుంటూ ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయారు. బావిలో పడిన మహిళలు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు అప్రమత్తమై వెంటనే వారిని బయటకు లాగి ప్రాణాలు కాపాడారు. చిత్తుకాగితాలు, చెత్తతో నిండిపోయిన బావి పూడుకపోయి ఉంటుందని, చెత్త సామాన్లు ఏరు కునేందుకు ముందుకు వెళ్లడంతో అందులోకి జారిపోయామని బాధిత మహిళలు వాపోయారు. పాడుబడిన బావులను అధికారులు వెంటనే మూసివేయాలని గ్రామస్థులు కోరారు.

ఏబీహెచ్‌ఏ అకౌంట్లను పూర్తిచేయాలి

- ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు

గద్వాల న్యూటౌన్, మార్చి 16 : ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లను(ఏబీహెచ్ఏ) పూర్తి చేయాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని పాత డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ఎంసీహెచ్ సిబ్బందికి అబాకార్డులపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆశ కార్యకర్త తన పరిధిలో ఉన్న బీపీ, షుగర్ బాధితులకు నెల నెల చెకప్‌లను నిర్వహించాలన్నారు. అలాగే కొత్త వారిని గుర్తించి వివరాలను పొందుపర్చాలన్నారు. బీపీ, షుగర్ వారికి ప్రతీ ఒక్కరికి పరీక్షలు చేసిన తర్వాతనే మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు శ్యాంసుందర్, మక్బూద్, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్ఎంలు గ్రేస్, లక్ష్మి, ఆశలు ఉన్నారు.

జిల్లాస్థాయిలో టాపర్లుగా నిలవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల

గట్టు, మార్చి 16 : పదవతరగతి చదువుతున్న విద్యార్థులు జరగబోయే పదవతరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో టాపర్లుగా నిలిచి మండలానికి, పాఠశాలలకు పేరు ప్రతిష్ఠలు తీసుకరావాలని జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల సూచించారు. శనివారం మండల పరిధిలోని తప్పెట్లమొర్సు గ్రామ పాఠశాలను పరిశీలించారు. పదవతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులతో ముఖాముఖిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరీక్షలకు సన్నద్ధమైన తీరును ఆమె విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ క్రిష్ణయ్యగౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుష్ఠువ్యాధిపై సర్వే



వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

ఎర్రవల్లి, మార్చి 16: అనుమానం ఉన్న మచ్చలు, స్పర్శలేని మచ్చలు ఉన్నట్లుతే సంబంధిత వైద్యులను సంప్రదించి నిర్ధారణ చేసుకొని సరైన వైద్యం పొంది వ్యాధిని నివారించుకోవచ్చని కుష్ఠువ్యాధి నివారణ రాష్ట్ర పరిశీలన అధికారి డాక్టర్ జరీనాబాను అన్నారు. ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇటిక్యాల, కొండేరు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను డాక్టర్ జరీనాబాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మచ్చలు ఉన్నవారు ఎలాంటి అనుమానం లేకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి డి.ప్రేమ్‌సాగర్, డీపీఎం హనుమంతురావు, సూపర్‌వైజర్‌శంకరయ్యశెట్టి, లెప్రసి నోడల్ పర్సన్ రమేష్, ఏఎన్ఎం నర్మద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి: ఎంపీపీ

ధరూరు, మార్చి 16 : వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్యల తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నజుమున్నీసా బేగం అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభంకావాల్సిన సర్వసభ్య సమావేశ కోరం లేకపోవడంతో గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. అనంతరం సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఆయా శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా విద్యుత్, ఇతర అంశాలపై కూడా మాట్లాడారు. సగానికిపైగా ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశంలో ఎంపీడీవో మంజుల దేవి, ఎంపీవో కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఐక్యతే అమరజీవికి నిజమైన నివాళి

గద్వాల టౌన్, మార్చి 16 : తెలుగు ప్రజలంతా ఐక్యతాభావంతో ఉండి రెండు తెలుగు రాష్ట్రాలు సర్వతో ముఖాభివృద్ధి సాధించడమే అమరజీవి పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి కాగలదని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆలూరు బిలకంటి రాము అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో దివంగత నాయకుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు గట్టు ఈశ్వరయ్య, కోశాధికారి సురేష్‌కుమార్, మాజీ అధ్యక్షుడు నందిమల్ల సురేష్, నాయకులు ఉరుకుందయ్య, గుంత కల్యాణ్, నరేంద్ర, వెంకటేశ్వర్లు, రమేష్, వేణు, నరసింహయ్య, సుధాకర్, నాగిశెట్టి, హనుమేష్, నాగేష్, ప్రకాష్ ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 3630 కేసుల పరిష్కారం

గద్వాల క్రైం, మార్చి 16 : జాతీయ లోక్ అదాలత్‌లో 3630 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి కె. కుశ అన్నారు. శనివారం గద్వాల, అలంపూర్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారి అనిరోజ్ క్రిస్టియన్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గంట కవితాదేవి, న్యాయాధికారులు ప్రభాకర్, ఉదయ్‌నాయక్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

హరితహారం లక్ష్యసాధనకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల, మార్చి 16: హరితహారం లక్ష్యాన్ని సాధించేందుకు సిద్ధంగా ఉండాలని ఇందుకు కావాల్సిన మొక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హరితహారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26లకు గాను ఏడాదికి 17.50లక్షల మొక్కలు నాటేవిధంగా లక్ష్యం నిర్దేశించారు. రాబోయే జూన్ జూలై మాసంలో వర్షాలు కురుస్తాయని అప్పటిలోగా నర్సరీలలో ఆరోగ్యవంతమైన మొక్కలను పెంచాలని ఆదేశించారు. ఈ మొక్కలు వర్షాలు ప్రారంభం కాగానే అన్ని శాఖలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం నాటాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది లక్ష్యసాధనకు ఇప్పటి నుంచే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, గుట్టలు, అవెన్యూ ప్లాంటేషన్ తదితర వాటిలో మొక్కలు నాటి వాటిని వందశాతం రక్షించే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖాధికారి నవీన్‌రెడ్డి, డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోవిందనాయక్, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, గద్వాల మునిసిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం

- వేర్వేరుగా పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్



జడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

గద్వాల/గద్వాల టౌన్, మార్చి 16: పట్టణ పరిధిలోని నదీ అగ్రహారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ సరిత హాజరై స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు. పురాతన ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రయాదవ్, శ్రీనివాస్ గౌడ్, కేకే వెంకటన్న, జయన్న, పరుషరాముడు, సమీ, తిరుపతన్న, బోయ వెంకటేష్, మల్లకంటి, దామోదర్ పాల్గొన్నారు. అలాగే గద్వాల మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పట్టణ సమీపంలోని నదీ అగ్రహారంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరహరి శ్రీనివాసులు, శ్రీనివాస్ ముదిరాజ్, నరహరి గౌడ్, మహేష్‌కుమార్, శ్రీమన్నారాయణ, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు కోటేష్, రంజిత్‌కుమార్, రామకృష్ణశెట్టి ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మల్దకల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ సరితమ్మ వైద్యసిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పాల్వాయి గ్రామంలో పల్లె దవాఖానాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీరోజు సమయపాలన పాటిస్తూ ఆరోగ్య విషయంపై ప్రజలకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ వైద్య సేవలందించాలని డాక్టర్ నవీన్‌కు సూచించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాగేంద్ర యాదవ్, భాస్కర్‌రెడ్డి, శివ, ముని, రామకృష్ణ, రవి, నరసింహులు, చంద్రన్న, శివయ్య, రవి పాల్గొన్నారు.

చెత్త సేకరణపై పన్ను ఉపసంహరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి
- మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా



మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల టౌన్, మార్చి 16 : పట్టణ పాలన సంస్కరణల పేరుతో ఇంటింటి నుంచి సేకరించే చెత్తపై పన్ను విధించే విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. చెత్త సేకరణపై పన్ను వసూలు చేసే విధానాన్ని నిరసిస్తూ శనివారం పార్టీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల తలెత్తిన కరువు నేపథ్యంలో ఇప్పటికే ఉపాధి అవకాశాలు లేక అల్లాడుతున్న ప్రజలపై చెత్తసేకరణ పేరుతో అదనపు భారాన్ని మోపడం సరికాదన్నారు. పట్టణ స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యనిస్తున్నామని, ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్నామని, పారిశుధ్య నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వమని చెప్పిన పాలకులు ఇళ్లలో నుంచి చెత్తను తీసుకువెళ్లేందుకు నెల రూ.60ల నుంచి రూ.100ల వరకు పన్ను విధించడం సరికాదన్నారు. మునిసిపాలిటీకి ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై దృష్టి సారించకుండా అదనపు ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపడం ఆమోదయోగ్యం కాదన్నారు. పేరుకుపోతున్న స్థిరాస్తి పన్ను, మునిసిపల్ దుకాణాల అద్దెల గురించి పట్టించుకోకుండా అదనపు పన్నులను విధించాలను కోవడం చేతగానితనమన్నారు. అదే సమయంలో పట్టణ పరిధిలో పెరిగిపోతున్న ఆక్రమణలు, లేఔట్‌లలో పబ్లిక్ అవసరాల కోసం ఉంచిన పదిశాతం స్థలాల కబ్జాపై తక్షణం దృష్టిసారించాలన్నారు. చెత్త సేకరణ కోసం విధించిన పన్నును ఉపసంహరిస్తూ వెంటనే కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని, లేనిపక్షంలో అన్నిపార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నరసింహా, నాయకులు వెంకటేష్, రంగన్న, రామకృష్ణ, కల్యాణ్, వీరేష్, గోకారన్న, అశోక్, నరేష్, కృష్ణ, పరమేష్, నరసింహ ఉన్నారు.

కవిత అరెస్టు అప్రజాస్వామికం

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవిందు
- గద్వాల పట్టణంలో ధర్నా



గద్వాల పాతబస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

గద్వాల టౌన్, మార్చి 16 : ఎలాంటి అధికారిక వారెంట్ లేకపోయినా ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు టి. గోవిందు అన్నారు. మద్యం కేసులో ఇప్పటికే నోటీసులు అందుకున్న కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఆమెను అరెస్టు చేయబోమంటూ ఉన్నత న్యాయస్థానానికి తెలిపిన ఈడీ అధికారులు అందుకు వి రుద్ధంగా వ్యవహరించడం అధికార దుర్వినియోగమన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి, బీజేపీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్ మాట్లాడుతూ కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే ధైర్యం కోల్పోయిన బీజేపీ ఈడీని అడ్డంపెట్టుకుని రాజకీయ కక్షసాధింపునకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మోదీ స్నేహితులు, కార్పొరేట్ కుబేరులు వేల కోట్ల రూపాయల బ్యాంకు సొమ్ములను ఎగవేసి విదేశాల్లో తలదాచుకుంటున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను మాత్రం పనికట్టుకుని వేధించడం దౌర్భాగ్యమన్నారు. అరెస్టులతో బీఆర్ఎస్‌ను భయపెట్టడం సాధ్యం కాదని, తమ నాయకుడికి పోరాటాలు కొత్తకాదని, న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగిరెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, నరహరి గౌడ్, నరహరి శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, మహేష్, కృష్ణ, నాయకులు కోటేష్, నరసింహా రెడ్డి, నాగులు యాదవ్, కురుమన్న, ధర్మనాయుడు, శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, మోబిన్, కమ్మరి రాము, వీరేష్ ఉన్నారు.

కవిత అరెస్టు అక్రమం

అయిజ : ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం అని బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ కురువ పల్లయ్య అన్నారు. శనివారం అయిజలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ జేబులో ఉన్న దొంగలే ఈడీ, సీబీఐ అని తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్‌ను బలహీన పర్చాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీని అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉరుకుంద, షైబు, పరమేష్‌గౌడు, దిలీప్ పాల్గొన్నారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడికి సత్కారం



చిన్నారెడ్డిని సత్కరిస్తున్న రాజీవ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి

గద్వాల, మార్చి 16: ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి శనివారం గద్వాలలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. సౌత్ ఇండియా కమ్యూనికేషన్ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌రెడ్డి స్వగృహానికి విచ్చేసిన ఆయనను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలిచేటి ఆ నంద్‌రెడ్డి, మహేందర్, ఎస్ఎస్‌యూఐ నాయకులు ప్రకాష్, మహబూబ్, గణేష్, చందు, నరసింహా, పరమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు

- జిల్లాలో 14 కేంద్రాలు, 7378 మంది విద్యార్థులు
- పాఠశాలల్లో ఏర్పాట్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు



గట్టులోని బాలికల గురుకుల పాఠశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

గద్వాల టౌన్, మార్చి 16 : ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదవతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసే విద్యార్థుల్లో 7,203 మంది రెగ్యులర్, 175 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. వీరి కోసం 41 కేంద్రాలను ఏర్పాటు చేయగా ప్రతి కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, మరొక డిపార్ట్‌మెంటల్ అధికారి విధులు నిర్వహిస్తారన్నారు. అన్ని కేంద్రాల వద్ద ప్రాథమిక ఆరోగ్యానికి సంబంధించి ఏఎన్ఎంలను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణ సాఫీగా సాగేందుకు రెండు క్రైం స్క్వాడ్ బృందాలు పని చేస్తాయన్నారు. విద్యార్థులు ఫొటో ఐడీ కార్డులు ధరించి నిర్ణీత సమయం ఉదయం 9.30 గంటలలోగా ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్లు పరీక్షకు అనుమతిస్తారన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

● **గట్టు:** పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నడంతో ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాచర్ల ఉన్నత పాఠశాల, గట్టు బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాల ఏర్పాట్లను ఎంఈవో కొండారెడ్డి, పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులు ఎంఆర్ శేషఫణిశర్మ, డిపార్టుమెంటల్ అధికారి ఆర్. శివశంకర్‌రెడ్డి పరిశీలించారు. గట్టు గురుకుల పాఠశాలలో 210 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 125 మంది, మాచర్ల ఉన్నత పాఠశాలలో 120మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో కొండారెడ్డి తెలిపారు.

● **మల్దకల్:** 'పది' పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరిండెంట్ జహీరుద్దీన్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మల్లప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్దకల్ మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 407మంది బాలబాలికలు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 156, జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 120, మల్దకల్ ప్రాథమిక పాఠశాల పరీక్ష కేంద్రంలో 131మంది బాలబాలికలు పరీక్షలకు హాజరవుతారన్నారు.

● **ఇటిక్యాల:** పదవ తరగతి పరీక్షలు ఈ నెల 18నుంచి ప్రారంభం కానున్నడంతో ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇటిక్యాల ఎంఈవో రాజు శనివారం తెలిపారు. మండలంలో ఇటిక్యాల, కోదండాపురం, కొండేరు, ఎర్రవల్లిలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 199 మంది, కోదండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 145, కొండేరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 150, ఎర్రవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో వివరించారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



గోపలదిన్నెలో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌వో

ఇటిక్యాల, మార్చి 16: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ శనివారం తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఆదివారం మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. మూడు రోజుల నుంచి బీఎల్‌వోలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి 18 ఏళ్లు నిండిన వారిని గుర్తిస్తు న్నారని, అలాగే ఓటరు జాబితాలో పేరు ఉండి మరణించిన వారి వివరాలు తొలగిస్తున్నారన్నారు. కొత్తగా వివాహం అయిన వారి పేర్లు, మార్పు, చేర్పులు ఉన్నట్లు అయితే వారు సైతం ఆదివారం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మానవపాడు, మార్చి 16: సమయపాలన, క్రమశిక్షణ, కార్యాచరణ అలవాటు కావాలంటే పాఠశాల స్థాయిలో జరిగే కార్యక్రమాలే కీలకమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సన్న అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ప్రార్థన సమయం నుండి సమయ ప్రకారం పాఠశాలను నడిపి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటచలం, జ్యోతి, సాహిదా, విద్యార్థుల తల్లిదండ్రులు రఘురామ్, సంజీవయ్య, రమేష్, చెన్నకేశవులు, మునిస్వామి తదితరులున్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన

ఇటిక్యాల మార్చి 16: స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఎస్వీఆర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి వారికి బోధించారు. కలెక్టర్‌గా కే. కీర్తన, డీఈవోగా హర్శిని, ఎంఈవోగా జెస్సికా, ప్రిన్సిపాల్‌గా శశాంక్, ఉపాధ్యాయులుగా పది మంది విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెట్ ఎస్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు టీకాలు తప్పనిసరి

వడ్డేపల్లి, మార్చి 16 : పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ పుష్పలత పాడి రైతులకు సూచించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని బుడమర్సు గ్రామంలో గేదెలు, ఎద్దులు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. శిబిరంలో 42 మంది రైతులకు చెందిన 284 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశామని పశు వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వరప్రసాద్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ లతీఫ్, ఓఎస్ రవికిరణ్, గోపాలమిత్ర లక్ష్మన్న ఉన్నారు.

సౌకర్యాల మెరుగుకు తోడ్పాటు

● మైనార్టీ సబ్ ప్లాన్ చైర్మన్ అతిక్‌ఉర్ రెహమాన్

గద్వాల టౌన్, మార్చి 16 : పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు తోడ్పాటునందిస్తానని మైనార్టీ సబ్ ప్లాన్ జిల్లా చైర్మన్ అతిక్‌ఉర్ రెహమాన్ అన్నారు. శనివారం పాఠశాలలో పలువురు మైనార్టీ నాయకులు, విద్యార్థులతో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన వసతులు కల్పిస్తామన్నారు. ఇందుకు సంబంధించి తల్లిదండ్రులు, మైనార్టీ ప్రతినిధులు తగిన సూచనలు అందజేయాలని కోరారు. సమావేశంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ జలీల్ అహ్మద్, పాఠశాల ప్రిన్సిపాల్ వనిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన వృత్తివిద్య కోర్సు పరీక్షలు

- చివరి పరీక్షకు 610 మంది హాజరు

గద్వాల టౌన్, మార్చి 16 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన వృత్తివిద్య కోర్సు పరీక్షలు శనివారం ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 628 మందికి గాను 610(97శాతం) పరీక్ష రాయగా 18 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రం గద్వాల పట్టణంలోని జ్ఞానప్రభ జూనియర్ కళాశాల కేంద్రంలో 444 మందికి గాను 432 మంది, అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 96 మందికిగాను 91 మంది హాజరుకాగా రెండు కేంద్రాల్లో 17 మంది గైర్హాజరయ్యారు. ధరూరు, గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 88 మందికిగాను 87 మంది పరీక్ష రాయగా, గట్టు కేంద్రంలో ఒక్కరు గైర్హాజరయ్యారు. దీంతో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసినట్లు డీఐఈఓ ఎం. హృదయరాజు ప్రకటించారు. పరీక్షలు సాఫీగా నిర్వహించడంలో సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్పీగా గుణశేఖర్ బాధ్యతలు స్వీకరణ



ఏఎస్పీ కె. గుణశేఖర్

గద్వాల క్రైం, మార్చి 16: గద్వాల జిల్లా అదనపు ఎస్పీగా కె. గుణశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-1, 2010 బ్యాచ్ డీఎస్పీగా సెలక్ట్ అయిన ఆయన వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించారు. అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లోని సీఐడీ సైబర్‌క్రైం విభాగంలో పనిచేసి బదిలీపై గద్వాల జిల్లా అదనపు ఎస్పీగా వచ్చారు.

రెండు వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలింపు

ధరూరు, మార్చి 16: ధరూరు మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిగా, మరోకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ధరూరు మండలం అల్వాల్‌పాడు గ్రామానికి చెందిన రమేష్ (35), గద్వాల నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా, గ్రామానికి చెందిన రాము గద్వాలకు వస్తుండగా ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. దాంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పతికి తరలించారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.